## చౌక్ రోడ్డు కాలువల్లో మట్టి పేరుకుపోయింది

**కాలువలపై ఉన్న సిమెంట్ పలకలు తీసివేయాలి.. షాపు యజమానులు సహకరించాలి.. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**



శ్రీకాకుళం, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త

చౌక్ రోడ్డు కాలువల్లో మట్టి పెద్ద ఎత్తున పేరుకు పోయిందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. పట్టణంలో గల కాలువలను ఆయన శాసన సభ్యులు గొండు శంకర్‌తో కలసి చౌక్ బజార్‌లోని కాలువలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలువలపై ఉన్న సిమెంట్ పలకలు తీసివేయాలన్నారు. షాపు యజమానులు సహకరించాలన్నారు. కాలువలు అన్నింటిని శాసన సభ్యులతో పరిశీలించారు. చౌక్ బజారుకు ఆనుకొని ఉన్న వీధులను పరిశీలించారు. రోడ్లపై పళ్లు, కూరగాయలు, తదితరమైనవి విక్రయిస్తున్న వారు రోడ్లపై చెత్త వేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్థానిక శాసన సభ్యులు గొండు శంకర్ మాట్లాడుతూ గత 15, 20 సంవత్సరాలుగా ఏటువంటి మరమ్మత్తులు, డ్రైనులు కట్టడం, టాప్‌లు మార్చలేదన్నారు. ఆనాడు కృష్ణ పార్క్ వద్ద డ్రైన్ గతంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హయాంలోనే డ్రైన్ కట్టడం జరిగిందని, ఈ రోజు వరకు ఆ డ్రైన్‌ను ఎవరూ పట్టించుకోలేదన్నారు. ఆ డ్రైన్ కూడా నేడు కట్టడం జరిగిందన్నారు. ఓ పక్క జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ పారిశుద్ధ్యం, కాలువలపై పెద్ద ఎత్తున స్పెషల్ డ్రైవ్ చేస్తున్నామన్నారు. మన నగరాన్ని సుందరంగా ఉంచేందుకు ప్రజలకు కూడా స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఇంటింటికి చెత్త ఎత్తుకెళ్లేవారు ఎవరైనా రాకపోయినా మీరు మున్సిపల్ కమిషనర్‌కు నేరుగా ఫిర్యాదు చేయవచ్చునన్నారు. మీ ప్రాంతంలో ఎటువంటి డ్రైనేజీ, రోడ్ల ఇబ్బందులు ఉంటే మున్సిపల్ కమిషనర్‌కు నేరుగా ఫోన్ చేయవచ్చునన్నారు. దాదాపుగా 200 పనులు చేయడం జరిగిందన్నారు. ఇప్పటికీ 20, 30 శాతం పనులు మాత్రం చేయగలిగామన్నారు. మరో 70శాతం పనులు రానున్న రోజుల్లో చేయగలుగుతామన్నారు. మొన్న మున్సిపల్ శాఖ మంత్రి జిల్లా పర్యటనలో భాగంగా అర్బన్ ఆథారిటీ నుండి 12 కోట్ల రూపాయలు జిల్లాకు ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లాకు డ్రైనేజీ సమస్యలు, మంచినీటి సమస్యలు లేకుండా చూస్తామన్నారు. ఈ పర్యటనలో జివిఎంసి అధికారి రాము, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కొత్తూరులో ఘనంగా నూతన పింఛన్ల పంపిణీ

కొత్తూరు, ఫిబ్రవరి 28 (ప్రభాతవార్త)



మండల కేంద్రమైన కొత్తూరులో నూతన పెన్షన్ల పంపిణీ కార్యక్రమం శనివారం అత్యంత ఉత్సాహంగా జరిగింది. లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావు ముఖ్య అతిథిగా విచ్చేసి, నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు తన చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా బుద్దల కర్రెమ్మ, కంట పగడాలమ్మ, దూడు ఆరుద్రమ్మ, శోంట్యాన నేలవేణి తదితరులకు పింఛన్లను పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆర్థిక భరోసా తమ కుటుంబాలకు ఎంతో మేలు చేస్తుందని లబ్ధిదారులు ఈ సందర్భంగా సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తులసీ వరప్రసాదరావుతో పాటు ప్రముఖ ఏ1 కాంట్రాక్టర్ పొగిరి అర్జున, చల్ల ధర్మారావు, లోతుగెడ్డ వెంకటరమణ, లోతుగెడ్డ ఆంజనేయులు, వడమ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. వీరందరూ కలిసి లబ్ధిదారులకు పింఛన్ కార్డులను అందజేస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

## మాతృమూర్తి యువజన సంఘం అధ్యక్షునిగా సురేష్



కవిటి, ఫిబ్రవరి 28 (ప్రభాతవార్త)

మాతృమూర్తి యువజన సంఘం అధ్యక్షునిగా అంగ సురేష్ ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు. మండలం కుసుంపురం గ్రామంలో ఉన్న మాతృమూర్తి యువజన సేవా సంఘం అధ్యక్షునిగా అంగ సురేష్, ఉపాధ్యక్షునిగా కీలు లోహిదాసు కార్యదర్శిగా ఆశిష్ కుమార్, సహకార దర్శిగా దుమ్ము నేలయ్య కోశాధికారిగా మోహన్ దోలాయి, సలహాదారుడుగా ప్రదీప్ ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు. ఎన్నికలకు గౌరవ అధ్యక్షులుగా ఆనంగి మాధవరావు శ్యామల ప్రసాదరావులు ఉండి ఎన్నికలను ఏకగ్రీవంగా జరిపించారు వీరంతా మాట్లాడుతూ మాతృమూర్తి యువజన సేవా సంఘం మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి యువజన సంఘానికి పేరు ప్రఖ్యాతలు తెస్తామని తెలిపారు.

## సేంద్రీయ పంటలకు అధిక డిమాండ్ :ఏడిఏ భవాని శంకర్

కవిటి, ఫిబ్రవరి 28 (ప్రభాతవార్త)



సేంద్రీయ పద్ధతిలో పండించిన పంటలకు అధిక డిమాండ్‌తో పాటు ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుందని వ్యవసాయ శాఖ ఏడిఏ భవాని శంకరరావు తెలిపారు. ఈ మేరకు శనివారం జగతి పంచాయతీ బట్టువానిపాలెం, జగతి గ్రామాల్లో గల రాగి పంటను పరిశీలించారు. అలానే జాగ్రత్తగా ద్రవ జీవామృతాన్ని పరిశీలించి ఆనందం వ్యక్తం చేశారు. ఇటీవల పంపిణీ చేసిన సైకిల్ వీడర్ కలిపి యంత్రాలను వినియోగిస్తున్న బట్టి వాని పాలెం రైతులను అభినందించారు. అనంతరం పిఎసిఎస్ కవిటి ద్వారా పంపిణీ చేస్తున్న యూరియా గోడౌన్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రబీలో వివిధ పంటలకు అవసరమైన యూరియాని అవసరమైన మోతాదులో అందించడం జరుగుతుందని తెలిపారు. ఈయనతో పాటు ఏవో శ్రీదేవి, బిసిసి పలువురు రైతులు పాల్గొన్నారు.

## పాతపట్నానికి క్రీడా కళ

**ఫలించిన ఎమ్మెల్యే ఎంజీఆర్ కృషి ..పాతపట్నానికి ఇండోర్ స్టేడియం మంజూరు**



పాతపట్నం, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త

నియోజకవర్గ యువత కల నెరవేరబోతోంది. క్రీడాకారుల కు మెరుగైన వసతులు కల్పించాలనే పట్టుదలతో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు (ఎంజీఆర్) చేసిన కృషి ఫలించింది. పాతపట్నం మండలం సీది గ్రామంలో అత్యాధునిక మౌలిక సదుపాయాలతో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి మోక్షం లభించింది. ఎమ్మెల్యే ఎంజీఆర్ విజ్ఞప్తి మేరకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రత్యేక చొరవ చూపారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) నిధుల నుండి రూ. 2,41,79,813 అంచనా వ్యయంతో ఈ ఇండోర్ స్టేడియం నిర్మాణానికి సూత్రప్రాయంగా ఆమోదం లభించింది. నియోజకవర్గ అభివృద్ధిలో ఇదొక కీలక మైలురాయిగా నిలవనుంది. గ్రామీణ యువతకు జాతీయ స్థాయి క్రీడా ప్రమాణాలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో పాతపట్నం యువతకు మెరుగైన క్రీడా మౌలిక సదుపాయాలు అందించాలనే సంకల్పంతో ఈ ప్రాజెక్టును సాధించామని ఎమ్మెల్యే గోవిందరావు పేర్కొన్నారు. భవిష్యత్తులో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. ఈ స్టేడియం అందుబాటులోకి వస్తే యువతకు ఆధునిక శిక్షణ సదుపాయాలు లభిస్తాయని, ముఖ్యంగా నారీ శక్తి - క్రీడా శక్తి నినాదంతో మహిళా క్రీడాకారులకు ప్రత్యేక ప్రోత్సాహం అందనుందని ఎమ్మెల్యే తెలిపారు. పాతపట్నం నుండి జాతీయ స్థాయి క్రీడాకారులు ఎదగాలనేది తన ఆశయమని ఇది గొప్ప వేదిక కానుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## దర్జాలేని దర్జీ బతుకులు : టైలర్స్ యూనియన్ అధ్యక్షులు కొంచాడ ప్రభాకరరావు

**పాతపట్నంలో ఘనంగా టైలర్స్ డే వేడుకలు..టైలర్లకు పెన్షన్, హెల్త్ కార్డులు మంజూరు చేయాలి**


పాతపట్నం, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:



స్థానిక ఆల్ ఇండియా రోడ్డు జంక్షన్ వద్ద శనివారం టైలర్స్ డే (కుట్టు కళాకారుల దినోత్సవం) వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాతపట్నం పట్టణ టైలర్స్ యూనియన్ ప్రెసిడెంట్ ప్రభాకరరావు టైలర్ల జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రింబవళ్లు కష్టపడి సమాజానికి అందాన్నిస్తున్న టైలర్ల జీవితాల్లో చీకట్లు నిండుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దర్జీలు వారి జీవితంలో దర్జాగా లేరని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం టైలర్ల కష్టాలను గుర్తించాలని ఆయన కోరారు. వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్న టైలర్లకు ప్రత్యేక పెన్షన్ సౌకర్యాన్ని కల్పించాలని, అలాగే ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు ఆదుకునేందుకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలన్నారు. టైలర్ల సంక్షేమం కోసం ప్రభుత్వం తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టైలర్స్ యూనియన్ సభ్యులు వల్ల నాగేశ్వరరావు, భద్రయ్య, బోడ నందన్, కట్టా మోహన్, అలంకార్ టైలర్, క్లాసిక్ టైలర్, యువర్ టైలర్, డీసెంట్ టైలర్, టిప్ టాప్ టైలర్ గురుమూర్తి, ఫ్రెండ్స్ టైలర్, విశ్వనాథం మరియు తదితర టైలర్లు పాల్గొన్నారు.

## ఆదర్శ పాఠశాలలో ఘనంగా జాతీయ వైజ్ఞానిక దినోత్సవ వేడుకలు

పాతపట్నం, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:



స్థానిక పీఎం శ్రీ ఆదర్శ పాఠశాల జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ రత్నకుమారి అధ్యక్షతన జాతీయ వైజ్ఞానిక దినోత్సవ వేడుకలను శని వారం ఘనంగా నిర్వహిం చారు. ముందుగా సర్ సివి రామన్ చిత్రపటానికి పూల మాలలు అలంకరించి జ్యోతి ప్రజ్వలన గావించి సైన్స్ దినోత్సవ వేడుకలను ప్రారంభించారు. ఈ వేడుకలలో విద్యార్థులచే నిర్వహించబడిన వైజ్ఞానిక ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థులకు సైన్స్ ఎగ్జిబిషన్‌తో పాటు వ్యాసరచన, వక్తృత్వం, పెయింటింగ్ కాంపిటీషన్స్ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రత్నకుమారి విద్యార్థులను ఉద్దేశించి మాటాడుతూ 2026వ సంవత్సరం జాతీయ సైన్స్ దినోత్సవం యొక్క అధికారిక ఇతివృత్తాన్ని, విజ్ఞాన శాస్త్రంలో మహిళలు వికసిత్ భారత్‌ను ఉత్ప్రేరపరచడం వంటి అంశాలను వివరించారు. వైస్ ప్రిన్సిపల్ ప్రసాదరావు మాట్లాడుతూ ఆధునిక సమాజానికి సైన్స్ వెన్నెముక అని జాతీయ సైన్స్ దినోత్సవం గుర్తుచేస్తుందన్నారు. స్వచ్ఛమైన నీటి నుండి అంతరిక్ష పరిశోధనల వరకు, సైన్స్ జీవితాలను మెరుగుపరుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు చిన్న బాబు, అప్పలరాజు, సురేష్, దేవి, రాములు, ఇతర ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## డీజీ పురం పాఠశాలలో సైన్స్ దినోత్సవం వేడుకలు



సంతబొమ్మాళి, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త

మండలంలోని దండుగోపాలపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. సైన్స్ ఉపాధ్యాయులు రోణంకి అన్నాజీ, జామి శ్రీనివాసరావు, బసవల శ్రీనివాసరావు, పూన్న సూర్య ప్రకాష్ ఆధ్వర్యములో జరిగిన ఈ వేడుకలలో సి.వి.రామన్ సైన్సుకి చేసిన సేవలకు గాను విద్యార్థులు ఆయన పేరు అక్షరాకృతిలో కూర్చుని అతని పట్ల తమ మక్కువను చాటుకున్నారు. మొదట పాఠశాలలోని జాతీయ నాయకుల విగ్రహాలుకు, సి.వి.రామన్ చిత్రపటానికి పుష్పమాలాలంకృతులను ప్రధానోపాధ్యాయులు పిట్ట గంగన్న చేశారు. తరువాత అన్నితరగతుల విద్యార్థులు చేసిన ప్రాజెక్టుల ప్రదర్శనను ప్రారంభించారు. ఈ ప్రాజెక్టులలో బిందు సేద్యం, స్మోక్ ఎలర్ట్, హైడ్రాలిక్ క్రేన్, వర్షపునీరు సంరక్షణ, పవనవిద్యుత్, జలచక్రము, చంద్రయాన్ 3, అగ్నిపర్వతము నమూనా, పౌష్టిక ఆహారము, విండ్ మిల్, సైన్సు రంగ వల్లికలు వంటి 26 సైన్సు వర్కింగ్ మోడల్స్ ప్రదర్శించారు. విద్యార్థులు వాటిని ఆసక్తితో తిలకించారు. ఈ ప్రదర్శన ఉదయము 930 నుండి 200 గంటల వరకు కొన సాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశములో పాటశాల ప్రధానోపాధ్యాయులు గంగన్న, జే.శ్రీనివాసరావు, మిగతా సైన్సు ఉపాధ్యాయులు విద్యార్థుల నుద్దేశించి మాట్లాడుతూ సైన్స్‌డే ను రామన్ కనిపెట్టిన రామన్ ఎఫెక్టును ఫిబ్రవరి 28న కనిపెట్టారని దానికి గుర్తుగా ప్రతీ ఏడాది అదే రోజు సైన్స్ డే నిర్వహిస్తున్నామని వివరించారు. "సి.వి. రామన్" చిత్రాన్ని రంగవల్లిగా వేయడము ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



ఈసందర్భంగా నిర్వహించిన క్విజ్, వ్యాసరచనలలోను మంచి ప్రదర్శన కనబరిచిన విద్యార్థులకు, ఉత్తమ ప్రాజెక్టులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు ఉపాధ్యాయు లు తమ కళ్ళద్దాలు ఏవిధంగా శుభ్ర పరుచుకోవాలో తెలిపే స్టాల్ ఏర్పాటు చేసి అందరి కళ్ళద్దాలు శుభ్రపరిచారు. అలాగే మండలంలోని కొల్లిపాడు ఉన్నత పాఠశాలలో కూడా జాతీయ సైన్స్ దినోత్స వం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మెట్ట రామారావు, సైన్స్ ఉపాధ్యాయులు పిలక ధనుంజయరావు,కె సత్యన్నారాయణ, ఉపాధ్యాయులు భాస్కరరావు, తిరుపతిరావు, లక్ష్మీనారాయణ, నాగేశ్వరరావు, శారదాంబ, శ్రీధర్, విజయలక్ష్మి, డి.శ్రీనివాసరావు, దయాసాగర్, శ్రీధర్, మార్పు లక్ష్మణమూర్తి, బడే నారాయణరావు, మార్కండేయులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమం సాధ్యం



సంతకవిటి, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:

మాజీ మంత్రి, రాజాం నియోజకవర్గ ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్, రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ కొల్ల అప్పలనాయుడుల ఆదేశాలతో సంతకవిటి మండలం అక్కరాపల్లి గ్రామంలో శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమం జరిగింది. గ్రామానికి చెందిన వావిలపల్లి తవిటినాయడు ఇటీవల కాలంలో అనారోగ్యంతో మరణించిన కారణంగా అతని భార్యకు స్పౌజ్ పెన్షన్ కింద వావిలపల్లి అచ్చంకు 4000 రూపాయలు పింఛన్ సంతకవిటి మండల తెలుగు యువత అధ్యక్షులు వావిలపల్లి శ్రీనివాస్ అందించారు. సంతకవిటి మండల ఐటీడీపీ అధ్యక్షులు కరగాన రామారావు, తూలుగు వెంకినాయుడు, నీటి సంఘం అధ్యక్షులు వావిలపల్లి సింహాచలం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్, కొల్ల అప్పలనాయుడులకు వావిలపల్లి అచ్చం కృతజ్ఞతలు తెలిపారు.

## ముందు రోజు పింఛన్ల పంపిణీతో లబ్ధిదారుల్లో ఆనందం

**మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తమ్మినేని గీత**



ఆమదాలవలస, ఫిబ్రవరి 28 (ప్రభాతవార్త)

ముందు రోజు పింఛన్ల పంపిణీతో లబ్ధిదారులకు ఆనందం కలుగుతుందని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత అన్నారు. ఆమదాలవలస మున్సిపాలిటీలో 13వ వార్డులో పింఛన్లను శనివారం ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లబ్ధిదారులకు అండగా నిలుస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ చేయూతను అందించాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే కూన రవికుమార్ ఎనలేని కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రతినెల లబ్ధిదారుల ఇంటికే వెళ్లి పెన్షన్ అందించడంతో వారి ఇళ్లలో ఆనందాన్ని చూస్తున్నామని అన్నారు. కుటుంబంలో భర్తకు పెన్షన్ వచ్చి ఆ భర్త మరణిస్తే వెంటనే భార్యకు పెన్షన్ బదిలీ చేసే విధానాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. దీనివలన అర్హులైన ప్రతి లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్ల అందేలా కృషి చేస్తుందని అన్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల లబ్ధిదారులందరికీ ఇంటి వద్దనే పెన్షన్ పంపిణీ చేయడం సంతోషంగా ఉందని అన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి క్రమం తప్పకుండా పెన్షన్ పంపిణీ చేయడం కూటమి ప్రభుత్వానికే సాధ్యమని, సామాజిక పింఛన్ల పంపిణీలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తూ, అర్హులైన వారికి నెల మొదటి తేదీనే నేరుగా పింఛను అందించడంతో ఈ ప్రభుత్వం తమ వెంట ఉందన్న భరోసా, ధైర్యం, నమ్మకం వారికి కలుగుతున్నాయని అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పింఛన్ పెంపుదల చేసి గడప వద్దకే అందించడం జరుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన మాటలకు కట్టుబడి హామీలు అమలు చేసిన గొప్ప ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు చరిత్రలో నిలిచిపోతారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత అభివృద్ధి, సంక్షేమం సమాంతరంగా సాగుతోందన్నారు. అవినీతిరహిత పాలన అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. జనరంజక పాలన అందిస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు పెద్ద ఎత్తున ఆదరిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## వేరుశనగ సాగుపై రైతులు అవగాహన పెంచుకోవాలి



కోటబొమ్మాళి, ఫిబ్రవరి 28 (ప్రభాతవార్త) :

రబీలో రైతులు సాగుచేస్తున్న వేరుశనగ పంటలో యాజమాన్య పద్ధతులపై రైతులు అవగాహన పెంచుకోవాలని వ్యవసాయశాఖ టెక్కలి ఏడీఏ కె.జగన్మోహన్‌రావు తెలిపారు. ఆయన శనివారం మండలంలోగల లఖందిడ్డి గ్రామంలో వేరుశనగ సాగు పద్ధతులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేరుశెనగ పంటకు రెండవ గొప్పు పెట్టేముందు ఒక ఎకరాకి 200 కేజీల జిప్సం జల్లుకోవాలని, దీంతో అధిక దిగుబడి సాధించవచ్చునని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎస్.గోవిందరావు, నీటి సంఘం అధ్యక్షుడు కర్రి అప్పారావు, రైతులు పాల్గొన్నారు.

## పింఛన్లతో ఆర్థికాభివృద్ధి : టిడిపి మాజీ అధికార ప్రతినిధి గుడివాడ

వీరఘట్టం, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త :



ప్రభుత్వం ప్రతి నెల అందజేసే పింఛన్లతో ఆర్థికాభివృద్ధితో ఎదగవచ్చని, ప్రజలకు ఇవి ఎంతగానో ఉపయోగపడతా యని సీనియర్ టిడిపి నాయకులు, మాజీ అధికార ప్రతినిధి, మాజీ బీసీ సెల్ కన్వీనర్ గుడివాడ కూర్మి నాయుడు (మహేష్) అన్నారు. శనివారం మండలంలోని ఆయన సొంత గ్రామమైన విక్రమపురంలో పింఛన్లను పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ పెన్షన్లు అవసరాలతో పాటు, ఇతర ఖర్చులకు కూడా వెసులుబాటు అవుతుందని ఆయన అన్నారు. ఎంతోమంది నిరుపేద కుటుంబాలకు ఈ పెన్షన్లు బాసటగా నిలుస్తాయని ఆయన గుర్తు చేశారు. ప్రతినెల ఈ పింఛన్లు ప్రభుత్వ అధికారుల జీతాల కంటే ముందుగానే లబ్ధిదారులకు నేరుగా ఈ పెన్షన్లు ప్రభుత్వం అందించటం ఎంతో గొప్పతనం అని ఆయన అన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని వృద్ధులకు, వితంతువులకు, వికలాంగుల ఇళ్లకు స్వయంగా వెళ్లి వాటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## రెచ్చిపోతే తాటతీస్తాం...

**హుస్సేన్‌పురంలో పోలీసుల కార్డన్ సెర్చ్ ఆపరేషన్..డ్రోన్ పహారాలో గ్రామంలో నిఘా ..600 లీటర్ల బెల్లం ఊటలు ధ్వంసం ..II బైక్‌లు స్వాధీనం**

వీరఘట్టం, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త



ఎవరైనా, ఎంతటి వారైనా రెచ్చిపోతే తాటతీస్తామని పోలీసులు హెచ్చరించారు. పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పి ఎస్.వి.మాధవరెడ్డి ఆదేశాల మేరకు వీరఘట్టం మండలంలోని హుస్సేన్‌పురం గ్రామంలో శనివారం వేకువ జామున పోలీసులు విస్తృతంగా కార్డన్ సెర్చ్ ఆపరేషన్‌లో భాగంగా ఆకస్మిక సోదాలు నిర్వహించారు. నేర నియంత్రణ, గంజాయి, నాటు సారా, మద్యం అక్రమ రవాణా, నిల్వలను గుర్తించేందుకు, అనుమానిత వ్యక్తులపై నిఘా ఏర్పాటు చేసేందుకు ఈ ఆపరేషన్‌ను చేపట్టారు. గ్రామంలో అడుగడుగునా జల్లెడ పట్టి మరీ తనిఖీలను చేపట్టారు. ఈ సందర్భంగా అక్రమ మద్యం తయారీకి ఉపయోగిస్తున్న సుమారు 600 లీటర్ల బెల్లం ఊటలను పోలీసులు గుర్తించి ధ్వంసం చేశారు. అలాగే సరైన పత్రాలు చూపలేకపోయిన 11 ద్విచక్ర వాహనాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా నాటు సారాను తయారు చేసిన, విక్రయించిన, శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన కఠిన చర్యలు తప్పవని వారు హెచ్చరించారు. ఈ తరహా అక్రమ కార్యకలాపాలపై ఎల్లప్పుడూ నిఘా ఉంటుందని ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని వారు ఘాటుగా హెచ్చరించారు. చినమేరంగి, ఎల్విన్ పేట సిఐలు టి.వి తిరుపతిరావు, బి.హరి నేతృత్వంలో జరిపిన కార్డన్ సెర్చ్ ఆపరేషన్‌లో వీరఘట్టం ఎస్సై షణ్ముఖరావుతో పాటు పాలకొండ, సీతంపేట, జియ్యమ్మవలస, గరుగుబిల్లి, ఎల్విన్ పేట, కురుపాం ఎస్సైలు డి.వెంకన్న, వై అమ్మన్నరావు, ఎన్.ప్రశాంత్ కుమార్, ఫక్రుద్దీన్, బి.శివ ప్రసాద్, పి.నారాయణరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# శ్రీకాకుళం వార్త

## జలుమూరులో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం



జలుమూరు, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:

మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీముఖ లింగం పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారులు బమ్మిడి మాధవరావు, ఎం వి ఆర్ ఎస్ ప్రసాదరావు, మండల స్థాయి సైన్స్ ఫెయిర్ కార్యక్రమంలో పాల్గొన్నారు. మండల స్థాయిలో అనేక పాఠశాలల విద్యార్థులు పాల్గొనగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను జలుమూరు మండల పరిషత్ ఆదర్శ పాఠశాల, మండల పరిషత్ పాఠశాల పాగోడు, మండల పరిషత్ పాఠశాల కరకవలస విద్యార్థులు బహుమతులు సాధించారు. మండల విద్యాశాఖ అధికారులు మాట్లాడుతూ రామన్ ఎఫెక్ట్ కనిపెట్టిన రోజునే దేశంలో జాతీయ సైన్స్ దినోత్సవం (నేషనల్ సైన్స్‌డే) గా జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు అండగా ఇందిరా దేవి

కవిటి, ఫిబ్రవరి 28 (ప్రభాతవార్త)



పేద విద్యార్థులకు అండగా శ్రీ చింతామణి ట్రస్ట్ హైదరాబాద్‌కు చెందిన ఇందిరా దేవి నిలుస్తున్నారు. ఇందిరా దేవి శ్రీ చింతామణి ట్రస్ట్ హైదరాబాద్ పేరుతో సంస్థను స్థాపించి గత నాలుగేళ్ల కాలంగా ఎందరో పేద విద్యార్థులకు వారి చదువు నిమిత్తం లక్షల రూపాయలు ఆర్థిక సహకారాన్ని అందిస్తున్న విషయం పాఠకులకు విధితమే. అందులో భాగంగా శనివారం శ్రీ చింతామణి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో 16 మంది విద్యార్థులకు మూడు లక్షల 70 వేల రూపాయల ఆర్థిక సహకారాన్ని అందించే కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ పూడి లక్ష్మణరావు సమక్షంలో చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ఇందిరా దేవి, కుమారుడు మణికుమార్ ప్రతి ఏటా చింతామణి అమ్మవారు ఆలయ అభివృద్ధికి అలానే ఎందరో పేద విద్యార్థులకు భరోసాగా నిలుస్తున్నారని వారి సేవలు ఉద్దానం ప్రజలు మరువలేరని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి బెందాళం రమేష్, మాజీ సర్పంచులు ఆరంగి మధు, పాండవ చంద్రశేఖర్, ఉషోదయ అధ్యక్షులు ఆరంగి కృష్ణారావు, గ్రామ పెద్దలు బెందాళం కామరాజు, పొల్లాయి లక్ష్మణమూర్తి, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆరంగి త్రివిక్రమరావు, బెందాళం రంగారావు, పొల్లాయి సింహాచలం, పొల్లాయి దేవరాజు, మొగిలిపురి నాగేశ్వరరావు, మొగులపురి కృష్ణారావు, పొల్లాయి కృష్ణారావు, తెప్పల మోహన్ రావు, మొగలిపురి సీతారాం, ఉషోదయ కార్యదర్శి పొల్లాయి రుద్రయ్య, గిరిబాబు, గోరకల రామా రావు, ఉపాధ్యాయులు, హెచ్‌ఎం విశ్వనాథం, మల్లేశ్వరరావు, శ్రీనివాసరావు, జానకిరామ్‌లతో పాటు పలువురు గ్రామ పెద్దలు ఉషోదయ సంఘం అధ్యక్షులు గౌరవ సభ్యులు, యువకులు పాల్గొన్నారు.



## ఘనంగా సైన్స్ డే ఉత్సవాలు

కంచిలి, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త

బూరగాం ఉన్నత పాఠశాల ఆవరణలో సైన్స్ డే సందర్భంగా విద్యార్థులు అనేక ప్రయోగాలను ప్రదర్శిస్తూ సందర్శకులను ఆకట్టుకున్నారు. తాము తయారు చేసిన ప్రాజెక్టులను ఉపాధ్యాయులకు చక్కగా వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముప్పన సోమేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు మాట్లాడుతూ సముద్రం నీలిరంగులో ఎందుకుంటుంది? ఆకాశం నీలిరంగులోనే ఎందుకుంటుంది ?పగలు నక్షత్రాలు ఎందుకు కనబడవు? అసలు రామన్ ఎఫెక్ట్ అంటే ఏమిటి? వీటన్నిటికీ సమాధానం సీవీ రామన్ కనుగొన్న సిద్ధాంతాలే ప్రామాణికమని విద్యార్థులు పేర్కొన్నారు. సైన్స్ రంగంలో ఎవరు చేయలేని పరిశోధనలను అత్యంత సునాయసంగా చేధించి ప్రపంచ విని వీధుల్లో మన దేశ పతాకాన్ని రెపరెపలాడించారని ఉపాధ్యాయులు కొనియాడారు. అలాగే వైజ్ఞానిక రంగంలో తొలి నోబెల్ బహుమతి పొందిన శాంతి పుంజం, మహనీయుడు భారతరత్న అందుకున్న తొలి విజ్ఞాన కెరటం సివి రామన్ శాస్త్రవేత్త అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు జడత్వ నియమాలు, పర్యావరణం వేడెక్కడం, కాంతి పరావర్తన నియమాలు, కాంతినీడలు, జలచక్రం, జీవవైవిధ్యం, కొండ ప్రాంతంలో వ్యవసాయం, నీటి శుద్ధి మొదలగు ప్రయోగాలను చేసి విద్యార్థులకు ఆకట్టుకున్నారు కార్యక్రమంలో పాఠశాల సెక్రెటరీ చంద్రశేఖర్, రోజా రాణి, కె.చలపతి, ఎంవి రమణ, నిరంజన్, కాంతారావు, గణేష్ ,సోమేశ్ తదితరులు పాల్గొన్నారు.


## బేటీ బచావో బేటీ పఢావో కార్యక్రమం

పాతపట్నం, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:



ఆడపిల్లలను గౌరవంగా పెంచాలని, వారిని ఉన్నత చదువులు చదివించి తమకాళ్లపై తాము నిలబడేలా తీర్చిదిద్దాలని స్థానిక పియం శ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సనపల వైకుంఠరావు అన్నారు. పాఠశాలలో శనివారం నిర్వహించిన బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్తు స్త్రీ శక్తి పైనే ఆధారపడి ఉందని, నేటి ఆడశిశువే రేపటి బాలికగా, స్త్రీమూర్తిగా మారుతుందని పేర్కొన్నారు. సృష్టికి మూలమైన ఆడశిశువును ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని, ఇల్లాలి చదువు ఇంటికి వెలుగు అని ఆయన కొనియాడారు. ఐసిడిఎస్ సూపర్ వైజర్ జి.అనురాధ మాట్లాడుతూ బాలికలు శారీరకంగా, మానసిక దృఢత్వంతో పెరగాలని, ధైర్యంగా ఉంటూ పూర్తి జీవితాన్ని అనుభవించాలని ఆకాంక్షించారు. ఆపద సమయాల్లో బాలికలు, మహిళలు 1098, 181, 112, 100 వంటి హెల్ప్‌లైన్ నంబర్లను వినియోగించి నిస్సహాయ స్థితిలో తక్షణ సహాయం పొందాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయురాలు భార్గవి మాట్లాడుతూ ప్రతి స్త్రీ అవసరమైన వేళ ధైర్యంగా ఉండాలని, ఒకరికొకరు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త శాంతామణి, కృష్ణారావు మరియు పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## సంతబొమ్మాళిలో జాతీయ సైన్స్ దినోత్సవం




సంతబొమ్మాళి, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త

జాతీయ సైన్స్ దినోత్సవ సందర్భంగా ఎంపీపీ ఎస్ సంతబొమ్మాళి పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వివిధ రకాల సైన్స్ ప్రాజెక్ట్ లు విద్యార్థులు తయారు చేసి దాని ఉపయోగాలు వివరించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ జలుమూరు చిన్నవాడు సందర్శించి సంతృప్తి వ్యక్తం చేయడం జరిగింది. ఇటు విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలు చాలా ఆసక్తిగా తిలకించారు. దీనికి పాఠశాల హెచ్ ఎం అంగూరి రామారావు, సనపల నరసింహమూర్తి, హరి ప్రసాద్, మయూరి, ఆనందరావు, రోజా రమణి, సిమ్మన్న, రజిని, మొదలగు ఉపాధ్యాయులంతా పాల్గొన్నారు.

## అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం : ఎంపీటీసీ ప్రతినిధి బొడ్డేపల్లి

ఆమదాలవలస, ఫిబ్రవరి 28,(ప్రభాతవార్త)



అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని ఆక్కులపేట ఎంపీటీసీ ప్రతినిధి బొడ్డేపల్లి లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం అక్కులపేట గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం ఇంటింటికి వెళ్లి చేపట్టారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిందని తెలిపారు. రూ.3 వేలు ఉన్న పెన్షన్ను రూ.నాలుగు వేలు చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే సాధ్యమన్నారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయ్యాయని తెలిపారు. ఎమ్మెల్యే కూన రవికుమార్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకుని వెళుతున్నారని అన్నారు. నియోజవర్గంలో అన్ని గ్రామాల్లో రహదారుల సౌకర్యం కల్పించిన ఘనత ఎమ్మెల్యే రవికుమార్‌కే సాధ్యమన్నారు. గత వైకాపా పాలనలో నియోజకవర్గంలో ఒక్క రోడ్డు కూడా వేయలేదని తెలిపారు. టీడీపీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు గ్రామాల్లో ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని అన్నారు. రానున్న ఎన్నికల్లో గ్రామాల్లో ప్రజలు టీడీపీకే పట్టం కట్టడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఒక్కరోజు ముందు పెన్షన్ ఇవ్వడంతో పేదల కళ్ళల్లో ఆనందం కలుగుతుందని లక్ష్మీనారాయణ అన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

